క్లుప్తంగా

కాణిపాకంలో సినీ నటి రమ్యకృష్ణ


రమ్యకృష్ణకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని బుధవారం సినీ నటి రమ్యకృష్ణ దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన సేవ కార్యక్రమాలను దగ్గర ఉండి చూశారు. వేద ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనాలు చేశారు. సిబ్బంది వాసు, బాలాజీ ఆమెకు చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలి


వరిసాగులో తీసుకోవాల్సిన మెలకువలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ ప్రవీణ్

తవణంపల్లె: పంటసాగులో ఎరువుల యాజమాన్య పద్ధతులు తప్పక పాటించాలని ఏఓ ప్రవీణ్ తెలిపారు. బుధవారం మండలంలోని నలిశెట్టిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నత్రజని ఎరువులను ఎక్కువగా వాడడం వల్ల కలుగు దుష్ప్రయోజనాలను వివరించారు. సేంద్రియ, జీవన ఎరువులు, నానో యూరియా నానో డిఏపి వాడడం వల్ల కలుగు ప్రయోజనాలు గురించి తెలిపారు. ప్రధాన మంత్రి ఫసల్ యోజన పథకం కింద వరి, రాగి, కంది పంటలకు భీమా పథకం అమలు చేస్తున్నట్లు వివరించారు. అదే విధంగా వరిసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వందన, రైతులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న డీఏఓ

కుప్పం: మండలంలోని ఎరువుల దుకాణాల్లో బుధవారం డీఏఓ మురళీకృష్ణ ఆకస్మిక తనిఖీలు చేశారు. అన్ని రకాలు స్టాక్ వివరాలు నమోదు చేయాలని, ఎరువుల అమ్మకాలు, స్టాక్ రిజిస్టార్‌లో అవకతవకలు జరిగితే దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన ఎరువులను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డుపై అడ్డంగా విరిగి పడిన చెట్టు కొమ్మ!



గంగవరం: మండలంలో కీలపట్లకు ఉన్న రోడ్డులో మంగళవారం రాత్రి వర్షానికి ఓ చెట్టు కొమ్మ విరిగి అడ్డంగా పడింది. ఇది ప్రమాదాలకు తావిచ్చేలా ఉన్నా సంబంధిత అధికారులు బుధవారం సాయంత్రమైనా తొలగించలేదు. ప్రసిద్ధ కోనేటిరాయస్వామి ఆలయానికి ఈ రోడ్డు మార్గానే వెళ్లాలి. రోజూ వందలాది వాహనాలు వెళ్లే ఈ మార్గంలో కొమ్మ పడటం మూలాన ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్తున్నాయి. ఇతర వాహనాలు మరో మార్గంలో చుట్టుకుని వెళ్తున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డుపై నుంచి కొమ్మను తొలగించి రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వర్క్ ఆర్డర్ ఉంటేనే..లేదంటే..!

పాలసముద్రం (కార్వేటినగరం): అనుమతి లేకుండా పాలసముద్రం మండలంలో ఎర్రమట్టి గ్రావెల్ తీయరాదని తహసీల్దార్ అరుణ కుమారి తెలిపారు. బుధవారం మండలంలోని వనదుర్గాపురం పంచాయతీ తమిళనాడు సరిహద్దులో వర్క్ ఆర్డర్ లేకుండా ఎర్రమట్టి గ్రావెల్ తీస్తున్నారని తహసీల్దార్‌కు ఫిర్యాదు అందడంతో వీఆర్ఓ వెంకటాచలంతో కలిసి ఆ ప్రదేశానికి వెళ్లి రికార్డులు పరిశీలించారు. అన్ని సక్రమంగా ఉన్నా వర్క్ ఆర్డర్ లేదని గుర్తించారు. ఎర్రమట్టిని ఆఢ్‌లోడ్ చేసి పంపించేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ, ఎర్రమట్టి గ్రావెల్ తీసుకెళ్లాలంటే తప్పకుండా నిబంధనల ప్రకారం అన్ని రికార్డులు ఉండాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది కూడా తమిళనాడు సరిహద్దులో అక్రమంగా ఎర్రమట్టి గ్రావెల్ తరలించకుండా చూడాలని ఆదేశించారు. అలా తీసుకెళ్లారని తన దృష్టికి వస్తే సంబంధిత వీఆర్వోలు చర్యలు తప్పవన్నారు.

హైస్కూల్ ప్లస్.. చదువులు మైనస్

పేద విద్యార్థుల అభ్యున్నతికి గత వైఎస్సార్ సీపీ సర్కారు ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్ పాఠశాలలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. విద్యాసంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో అధ్యాపకులను నియమించకపోవడం, మౌలిక వసతులు కల్పించకపోవడం.. వంటి సమస్యలు ఈ పాఠశాలల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లోని హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో అధ్యాపకులు లేక విద్యార్థినుల చదువులు అడకత్తెరలో పడుతున్నాయి.

- పేద విద్యార్థుల అభ్యున్నతికి గత ప్రభుత్వంలో ఏర్పాటైన హైస్కూల్ ప్లస్ స్కూళ్లు
- విద్యాబోధన, మౌలిక సదుపాయాలను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం
- విద్యార్థులు ఉన్నా పట్టించుకునే వారు కరువు
- ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల్లో చేరే స్తోమత లేకనే ఇక్కడ చేరామంటున్న విద్యార్థినులు
- నెలలు గడుస్తున్నా అధ్యాపకులు లేకపోవడంతో చదువులు ప్రశ్నార్థకం
- పాలక ప్రభుత్వంపై తల్లిదండ్రుల ఆగ్రహం



పూతలపట్టు మండలంలోని ఎం.బండపల్లి హైస్కూల్ ప్లస్

హైస్కూల్ ప్లస్ సమాచారం		
నియోజకవర్గం	హైస్కూల్ ప్లస్ స్కూళ్లు	విద్యార్థులు
చిత్తూరు	03	245
పూతలపట్టు	04	316
మొత్తం	07	561

చిత్తూరు కలెక్టరేట్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హైస్కూల్ ప్లస్ పాఠశాలలపై వివక్ష చూపుతోంది. వీటిని అభివృద్ధి చేయక పోగా మూసివేసేందుకు కుట్రలు పన్నుతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. పొమ్మనలేక పొగ పెడుతూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద గ్రామీణ విద్యార్థులకు ఉచిత ఇంటర్ కళాశాలలు ఉండాలనే ఉద్దేశంతో అన్ని మండలాల్లో హైస్కూల్‌కు అనుబంధంగా హైస్కూల్ ప్లస్ పేరుతో ఇంటర్ విద్యను ప్రవేశ పెట్టింది. అదే సమయంలో చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో పలు హైస్కూళ్లను హైస్కూల్ ప్లస్‌గా ఎంపిక చేశారు. ఆ సమయంలో ఆ హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో అవసరం మేరకు అధ్యాపకులను సైతం నియమించారు. ఇంతవరకు బాగానే ఉన్నా కూటమి ప్రభుత్వం ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయి. అందులో భాగంగా ఆ పాఠశాలల్లో పనిచేస్తున్న పలువురు అధ్యాపకులు బదిలీపై మరొకచోటకు వెళ్లారు. అయితే ఇక్కడకు అధ్యాపకులను కేటాయించలేదు. దీంతో పలు పాఠశాలల్లో అధ్యాపకుల కొరత వేధిస్తోంది.

నెలలు గడిచినా నియామకాలు నిల్

చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లోని హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో నెలలు గడుస్తున్నా అధ్యాపకుల నియామకం జరగడం లేదు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ హైస్కూల్ ప్లస్ పాఠశాలలు గ్రామీణ బాలికలకు సౌకర్యవంతంగా ఉండడంతో అడ్మిషన్లు సైతం పెరిగాయి. ఆయా పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరం అడ్మిషన్లు పొందిన బాలికలు అధ్యాపకులు వస్తారని నెలన్నరగా ఎదురు చూస్తూనే ఉన్నారు. కానీ ఇప్పటి వరకు అధ్యాపకుల నియామకం మాత్రం జరగలేదు. దీంతో విద్యార్థినుల్లో ఆందోళన నెలకొంది. ఇలాగైతే తమ భవిష్యత్ ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్‌లో ఫీజులు చెల్లించలేక

ఇంటర్మీడియట్ విద్యకు ప్రైవేట్ కళాశాలల్లో ఫీజులు చెల్లించలేక హైస్కూల్ ప్లస్‌లలో పలువురు విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. అయితే ఇక్కడ చేరినప్పటి నుంచి అసలు బోధనే జరగడం లేదని విద్యార్థులు నిట్టూరుస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తామంతా ప్రైవేట్ కళాశాలలను ఆశ్రయించాల్సిందేనంటూ ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై గ్రామీణ విద్యార్థినుల తల్లిదండ్రులు విమర్శలు గుప్పిస్తున్నారు.

అలసత్వం సరికాదు



పేద విద్యార్థుల అభ్యున్నతికి ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్‌లను నిర్వీర్యం చేయడం సరికాదు. కూటమి ప్రభుత్వం హైస్కూల్ ప్లస్ స్కూళ్ల పట్ల వివక్ష చూపించడం అన్యాయం. పేద విద్యార్థులకు న్యాయం చేయాల్సింది పోయి అన్యాయం చేయడం దారుణం. నెలలు గడుస్తున్నా అధ్యాపకులను నియమించకపోవడం దారుణం. ఇదే పద్ధతి కొనసాగితే పోరాటాలు తప్పవు.

–సద్దాం, స్టూడెంట్స్ జేఏసీ చైర్మన్, చిత్తూరు

ఘనంగా తిరునాళ్ల


సత్యమ్మ అమ్మవారు


మారెమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

గుడిపాల: మండలంలోని అడవిచేను గ్రామంలో బుధవారం సత్యమ్మ, మరెమ్మ తిరునాళ్లను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం అమ్మవార్లకు అభిషేకం నిర్వహించి ఊరేగింపుగా వెళ్లి మహిళలు అంబలి పోశారు. సాయంత్రం అమ్మవార్ల వద్ద పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి సత్యమ్మను గ్రామస్తులు పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

వీఆర్‌కు హెడ్ కానిస్టేబుల్

చిత్తూరు అర్బన్: చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఖాదర్ బాషాను వీఆర్ (వేకెంట్ రిజర్వ్)కు పంపుతూ ఎస్పీ మణికంఠ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయనపై వచ్చిన ఆరోపణల ఆధారంగా స్టేషన్ అధికారి ఇచ్చిన నివేదిక మేరకు ఎస్పీ చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

కూటమి మోసాలపై ప్రభుత్వాన్ని నిలదీద్దాం

- గత ప్రభుత్వంలో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేశాం
- ఇప్పుడు ఏడాదిన్నర కావొస్తున్నా ఏ పథకం సక్రమంగా అమలు కావడం లేదు
- అధికారం కోసమే చంద్రబాబు అబద్ధపు హామీలు
- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో వైఎస్సార్‌సీపీ చిత్తూరు సమన్వయకర్త విజయానందరెడ్డి


క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విజయానందరెడ్డి, నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను నిలదీయాలని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. బుధవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా 36వ డివిజన్ ఎంజీఆర్ వీధిలో నాయకులు విజయ్, 43వ డివిజన్‌లో గీతామందిరంలో నాయకులు సీతాపతి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అధికారం చేపట్టి ఏడాదిన్నర కావొస్తున్నా.. ఎన్నికల హామీల్లో ఎన్ని అమలు చేశారని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ పోరాడితే ఒకటి అరా పథకాలు అరకొరగా ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. ప్రజల తరపున వైఎస్సార్‌సీపీ పోరాడకుంటే అవి కూడా సీఎం చంద్రబాబు ఎగ్గొట్టేవారని ధ్వజమెత్తారు. ఇటీవల ఆడబిడ్డ నిధి పథకంపై మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలే (ఆ పథకం ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్ముకోవాలి) అందుకు నిదర్శనమన్నారు.

అప్పట్లో ఏడాదిలోనే అన్ని పథకాలు అమలు

వైఎస్సార్‌సీపీ హయాంలో అధికారంలో చేపట్టిన ఏడాదికే ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలన్నీ అమలు చేయడం జరిగిందని ఎంసీ విజయానందరెడ్డి తెలిపారు. ప్రతి వర్గానికి మేలు జరిగేలా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు ఇవ్వడం జరిగిందన్నారు. పేదలకు ఇస్తానన్న ఇళ్లు, 50 ఏళ్లకే బీసీలకు ఇస్తానన్న పింఛన్, మహిళలకు ఆడబిడ్డ నిధి, నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని చంద్రబాబును నిలదీశారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయాలని, హామీలు అమలు చేసేదాకా ప్రజల తరపున వైఎస్సార్‌సీపీ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాయత్రీదేవి నాయకులు హరీషారెడ్డి, కౌసర్, బిందు, నౌషద్, నవాజ్, స్టాండ్లీ, చాన్‌బాషా, వెంకటేష్, మల్లిఆచారి, పిచ్చాండి, శరవణ, చల్లాముత్తు, దౌలత్, ఇంతియాజ్, రాజేంద్రనాయకర్, సతీష్, నరేష్, శరత్‌కుమార్, దీపక్, షంషీర్, భువన్, మురగదాస్, విజయరెడ్డి, ధనంజయరెడ్డి, భరద్వాజ్‌స్వామి, చిట్టిబాబు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

చిత్తూరు అర్బన్: నగరంలో మురుగునీటి కాలువల్లో పేరుకున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, వీటి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండవద్దని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని ఎంఎస్‌ఆర్ కూడలి, దర్గా ప్రాంతం, కట్టమంచి తదితర ప్రాంతాల్లో మురుగు నీటి కాలువలను పరిశీలించారు. ఇటీవల వర్షాలు పడుతున్న నేపథ్యంలో కాలువల్లోని మురుగునీళ్లు రోడ్లపైకి, ఇళ్లలోకి వచ్చేస్తోందని పలువురు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. దర్గా కూడలి నుంచి నీటిని మళ్లించడానికి ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజినీరు వెంకటరామిరెడ్డి, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్ తదితరులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించండి

పూతలపట్టు(యాదమరి): రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి గంజిమల పూతలపట్టు ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఆమె మండలంలో పలు సంస్థల్లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగానే ఆమె మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన తీరును పరిశీలించారు. విద్యార్థులకు సరైన మోతాదులో ఆహారాన్ని అందించకపోవడాన్ని ఆమె గుర్తించారు. దీంతో వంట నిర్వాహకులతో, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులుపై మండిపడ్డారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని వారికి సూచించారు. నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనాలను విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంకు ఆదేశించారు. పిల్లలతో పాటు ఆమె కూడా భోజనం చేస్తూ కాసేపు ముచ్చటించారు. అనంతరం అంగన్‌వాడీ పాఠశాలను, రేషన్ షాపులలో తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూ నాగేశ్వరరావు, పలువురు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.


భోజన నిర్వాహకులతో మాట్లాడుతున్న దేవి గంజిమల

రహదారుల వెంబడి వ్యర్థాల కంపు..


రహదారి పక్కన పడేసిన కోళ్ల వ్యర్థాలు

బంగారుపాళెం: మండలకేంద్రంలోని కొందరు చికెన్ సెంటర్ల నిర్వాహకులు కోళ్ల వ్యర్థాలను రహదారుల పక్కన పడేస్తుండడంతో అటుగా వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అక్కడ వెలువడే దుర్వాసనకు జనం ముక్కులు మూసుకుని వెళ్తున్నారు. వీరిని నియంత్రించాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. బంగారుపాళెంలో 25 పైగా చికెన్ దుకాణాలు ఉన్నాయి. దుకాణదారులు ప్రతిరోజు వ్యర్థాలను రహదారుల పక్కన పడేసి పోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి, బంగారుపాళెం–అరగొండ రహదారి పక్కన, బంగారుపాళెం–రాగిమానుపెంట రోడ్డు పక్కన కోళ్ల వ్యర్థాలను పడేసి పోతున్నారని చెబుతున్నారు. తద్వారా పర్యావరణం కలుషితం అవుతోందని.. భరించలేని దుర్వాసన వెదజల్లుతున్నారని చెబుతున్నారు. రహదారుల పక్కన, చెరువుల వద్ద కోళ్ల వ్యర్థాలు పడేస్తుండడంపై స్థానిక ప్రజాప్రతినిధులు ఇటీవల జరిగిన మండల సర్వసభ సమావేశంలో కూడా సమస్యను ప్రస్తావించారు. సంబంధిత పంచాయతీ అధికారులు మాత్రం చికెన్ దుకాణ నిర్వాహకులపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా చికెన్, మాంసం విక్రయాలపై ఆహార భద్రతశాఖ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణ కొరవడింది. ఇప్పటి వరకు చికెన్ సెంటర్లలో తనిఖీ చేసిన పాపాన పోలేదు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఎడతెరిపి లేని వర్షం


దిగువ మోదలపల్లెలో కురుస్తున్న వర్షం

తవణంపల్లె: మండలంలో గత మూడు రోజులుగా వర్షం కురుస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగుకు అదును సమయంలో వర్షాలు పడలేదు. దీంతో ఈ ఏడాది వేరుశనగ పంట సాగు తగ్గింది. అయితే గత మూడు రోజులుగా మండలంలో సాయంత్రం వేళ మేఘావృతమై వర్షం పడుతోంది. సోమవారం 4.8 మిల్లీమీటర్లు, మంగళవారం 1.2 మిల్లీమీటర్లు, బుధవారం 24.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వర్షాల వల్ల కుంటలకు, చెరువులకు నీరు చేరలేదు. వర్షాలతో భూమిలో తేమశాతం పెరగడంతో వేరుశనగ పంట, మామిడి చెట్లు కళకళలాడుతున్నాయి. భారీ వర్షాలు కురిసి చెరువులు నిండుతాయని రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు


గుడిపాల: పొలంబడిలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ సంగీత

గుడిపాల: ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు సాధ్యమని వ్యవసాయాధికారి సంగీత తెలిపారు. బుధవారం 197రామాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి జీవన ఎరువులు వాడుకోవాలన్నారు. ఘన, ద్రవ, బీజ జీవామృతం, వేప గింజల కషాయం వీటిని తయారు పంటలకు వాడితే పంటలు మంచి దిగుబడి వస్తుందని చెప్పారు. వేరుశనగ పంటలో తెగుళ్ల నివారణకు రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అన్నదాత సుఖీభవకు సంబంధించి అర్హత ఉండి, జాబితాలో అనర్హులుగా వచ్చిన రైతులు రైతు సేవా కేంద్రాలు, ఆన్‌లైన్‌లో అర్జీలు పెట్టుకోవాలన్నారు. కౌలు రైతులు కార్డులు చేయించుకోవాలని సూచించారు.


మాట్లాడుతున్న ఏఓ

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం



గుడిపాల: పల్లూరులో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం, ర్యాలీ చేస్తున్న సూపర్‌వైజర్ విజయలక్ష్మి

గుడిపాల: తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లలిత తెలిపారు. బుధవారం పల్లూరు, చలిచీమలపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డపుట్టిన వెంటనే తల్లిముర్రుపాలను బిడ్డకు విధిగా తాగించాలన్నారు. ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని, తద్వారా పుట్టిన బిడ్డ చిన్నా చితక వ్యాధులకు దూరంగా ఉంటారన్నారు. తల్లి బిడ్డకు పాలు ఇచ్చే పద్ధతులను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని విధిగా గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లల తల్లులు తీసుకొని ఉపయోగించుకోవాలన్నారు.

ఐరాలలో..

ఐరాల: తల్లిపాలు బిడ్డకు అమృతమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని పెద్దగొల్లపల్లెలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బాలింతలు, గర్భిణులు, తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బిడ్డకు ముర్రుపాలు పట్టించడంతో వ్యాధి నిరోధకశక్తి పెరగడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు. బిడ్డ రోగాల బారిన పడకుండా రక్షణ కవచంలా తల్లిపాలు పనిచేస్తాయని చెప్పారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు పడితే బిడ్డతో పాటు తల్లి కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అనంతరం గ్రామంలో తల్లి ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


గుడిపాల: చలిచీమలపల్లెలో తల్లిపాల వారోత్సవం

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
చిత్తూరు - పూతలపట్టు :
95539 55610